ఆధారం :
ఆస్కార్ వైల్డ్

# లోనికి రాకూడదు

అనుసరణ:
శ్రీమతి వి. క్రిష్ణవేణి

ఎంత బాగుండేది ఆ తోట. నిత్య వసంతం, నిండు శృంగారం. గులాబీలు, చేమంతులు, జాజివిరజాజులు, ఒక టేమిటి రంగు రంగుల పూవులు, వింత వింతల సువాసనలు. నాలుగుమూలలా విశాలమైన పచ్చిక బయళ్లు; మధ్యను నిర్మలమైన కొలను. కొలనులో విహరించే హంసలను బయళ్లలో నక్షత్రాల్లా వెలిసిన వెలుగుమొగ్గలు తొంగి చూసి విస్తుపోయేవి. చుట్టూ అనేక ఫల వృక్షాలు లోపలున్న స్వర్గసీమకు పహరాయిస్తూ, కొమ్మలలో దాక్కుని కోయిలలు పేరు పేరు వరసని పిలిచేవి వాటి నేస్తాలను. చిలకలు గోరింకలూ అదో భావలో వింతగా జవాబిచ్చేవి.

స్కూలు గంట వినబడ్డం తడవు పలకా పుస్తకాలు చంకలో పెట్టి ఒక టేపరుగు తోటకి. మిడతలదండులా ప్రవేశించేవారు పిల్లకాయలంతాను. రామం, కిట్టప్ప, అబ్బులు జామిచెట్లూ, మామిడి చెట్లూ ఎక్కేవారు. లీల, ప్రభ, శశి లెక్కలేనన్ని పువ్వులు ఆబకొద్దీ కోసుకొని చెట్ల కింద నిలబడేవారు ముసి ముసి నవ్వులు నవ్వుతూ.

ఎంతకాలం వుంటుందీ యీ అనుభవం, యీ స్వేచ్ఛా విహారం. నేడో రేపో తోటకామందు తిరిగి వచ్చేస్తాడనీ, యీ చిట్టి తల్లుల ఆటలు యింక సాగవనీ ఆ కోయిలలకూ తెలుసు, ఆ గులాబీలకు తెలుసు. ఏంచేస్తాయి పాపం, తమ నేస్తాలు బడి పిల్లలకు చెప్దామంటే వాటికి నోరురాదాయె. వాటికి బెంగమాత్రం వుండేది యీ స్నేహంమూడ్నాళ్ల ముచ్చటేనని.

యముడులా తిరిగి వచ్చాడు గండ్రయ్య. ఆ తోట అతని హక్కు భుక్తాలకిందవుంది. ముత్తాత తన తాతకి, తాత తన తండ్రికి, తండ్రి తనకూ దాన విక్రయసమస్తాధికారాలతో హస్తగతం జేసాడట. ఈ తోట గండ్రయ్యదేనని ప్రపంచం అంతా వప్పుకుంటుంది. అయితేనేం? బండిదిగి తలుపు తెరచి చూసాడు. పిల్లల కిలకిలలు అతనికి కర్ణకఠోరమయినవి. వురుములా హుంకరించాడు "ఇక్కడ మీకెందుకర్రా? ఫోండి" అన్నాడో లేదో చిట్టి వాళ్లు మొహాలు వేళ్లాడేసి ఒక్కొక్కరే ఇంటిదారి పట్టారు మూగినోము ముత్తైదువుల్లాగ. మంజూ, కల్పకం ముక్కులు కంది వెక్కి వెక్కి యేడుస్తేనేం, గులాబీలు, చేమంతులూ కన్నీళ్లు కారుస్తేం, గండ్రయ్యకు హృదయం వుంటేగా? "నా తోట నాదే, యింకెవరిదికాదు. కావలిస్తే నా దస్తావేజులు చూసుకోండి" అనుకున్నాడు. వెంటనే ఒక పేద్ద బోర్డు తీసుకువచ్చి గేటుకు తగిల్చాడు. "ఇతరులు లోనికి రాకూడదు. వచ్చిన శిక్షింపబడుదురు" అని తాటికాయంత అక్షరాలు వ్రాసి చూసుకోండి నా ప్రతాపం అని ప్రకటించుకున్నాడు.

పిల్లలు ఆడుకోడానికి యింకో తోటేనాలేదు ఆ వూళ్లో. ఏంచేస్తారు పాపం గండ్రయ్య అంటే గడగడ ఆ వూరుకంతా. "ఎంత హాయిగా వుండేది అక్కడ" అనుకునేవారు. బడిగంట వినబడగానే ఆ తోట జ్ఞాపకం వచ్చేది. పలకా పుస్తకాలు చంకబెట్టుకుని గండ్రయ్య గేటును, బోర్డును దీనంగా చూస్తూ యింటికి పోయేవారు.

లోకమంతా వసంతమే. కాని గండ్రయ్య తోటలో మటుకు వసంతం ప్రత్యక్షం కాలేదు. ఎక్కడ చూసినా మొగ్గలూ, పక్షులూను. గండ్రయ్య తోటలో సహారా! చెట్లన్నీ మర్చిపోయి నిద్రపోతున్నాయి, యింకా లేవలేదేమో అనుకున్నాడు గండ్రయ్య. ఓనాడు పారిజాతం గడ్డిగుబ్బలోంచి తలపైకెత్తి చూసింది. దాని కళ్లకు నోటీసు బోర్డు భూతంలా ప్రత్యక్షమవగానే కళ్లు మూసుకుని తిరిగి దుప్పటి కప్పుకుని నిద్రపోయింది. ఆ స్మశానంలో గాలిదుమారాలు చెలరేగి గండ్రయ్యని గాభరా పెట్టాయి. ఇంకా వసంతం రాలేదేమాని బెంగపెట్టుకున్నాడు ఆ తోటకామందు. నెలలుగడిచినా ఆ తోటకుమటుకు బికారి రూపు పోలేదు.

ఆ నాటి రాత్రి అతనికి నిద్ర పట్టనేలేదు. విశ్వం అంతా అతన్ని వెలివేసినందుకు ఏడ్చాడు. కిటికీలోంచి ఆకాశంకేసి చూసాడు. నక్షత్రాలుకూడా తనవైఖరిని వెక్కిరిస్తున్నట్టు తోచింది. అంతలో...కోయిల కోయ్



http://www.maganti.org/

అంది. వసంతం వచ్చింది ఇంక నాకేం అనుకుని తోటలోకి ఒకటే పరుగు.

అతని నిద్ర కళ్లకు ఒక అద్భుత దృశ్యం కనిపించింది. సంపెంగకు ఒకటే ఒక మొగ్గ. పక్కనున్న మామిడిపై కోయిల కోయ్ అని కూస్తోంది. దీనికి కారణం? గండ్రయ్య నిద్రపోతున్నాడనియెంచి కొంటె పిల్ల శశి గేటు దూకి తోటలో ప్రవేశించింది. ఆమెకు సంపెంగ హారతిపట్టి కోకిల మంగళగానం పాడింది. గండ్రయ్యను చూచి శశి పరుగెత్తనారంభించింది. వచ్చిన వసంతం తిరిగి పారిపోతుందేమోనని భయపడి గండ్రయ్య "చిట్టి తల్లీ! యీ తోట నీదే" అన్నాడు. గేటు తీసి తన వేలుమాపి శశి, "మరి, ఆ బోర్డో" అంది వణుకుతూ. గండ్రయ్య ఆ బోర్డు వెనకకు తిప్పి "చిట్టి తల్లులందరికీ సుస్వాగతం" అని తాటి కాయంత అక్షరాలతో వ్రాసాడు.

ఆ నాటినుంచీ గండ్రయ్య తోటలో నిత్య వసంతం, నిండు శృంగారం.

★



బ్రాంచి: రాజమండ్రి.





http://www.maganti.org/

Source: A.P. Press Academy Website, Andhra Mahila Magazine – June 1945

Disclaimer: This topic/article/write-up of Oscar Wilde Translation by Smt. B. Krishna Kumari has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan